
## పసుపుబోర్డుకు చట్టబద్ధతేదీ?

పసుపుబోర్డు వచ్చినా రైతులకు ఫాయిదా లేదని కవిత అన్నారు. కేంద్రం పేరుకే గెజిట్ జారీ చేసి పసుపుబోర్డు ఏర్పాటు చేసిందని, దానికి చట్టబద్ధత ఏదని ప్రశ్నించారు. బోర్డుకు చట్టబద్ధత ఉంటే బయటి దేశాల నుంచి వచ్చే నాసిరకం పసుపు దిగుమతులు తగ్గుతాయన్నారు. దాని వల్ల స్థానికంగా పసుపునకు మంచి రేటు వస్తుందని చెప్పారు. పసుపుబోర్డుకు చట్టబద్ధత కోసం పోరాటం చేస్తామని కవిత స్పష్టం చేశారు. పసుపు పండించి దీనావస్థలో ఉన్న రైతులను తక్షణం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలన్నారు. శివరాత్రి తర్వాత మహారాష్ట్ర నుంచి మార్కెట్‌కు పసుపు వస్తుందని, అప్పుడు ధర మరింత తగ్గే ప్రమాదముందని కవిత ఆందోళన వ్యక్తం చేశారు. రైతులంతా పోరాటం చేసే సమయం ఆసన్నమైందన్నారు. పసుపు రైతుల పక్షాన బీఆర్ఎస్ పోరాటం చేస్తుందని హామీ ఇచ్చారు. బీజేపీ చెప్పినట్లు కనీస మద్దతు ధర రూ.15వేలు అమలయ్యేలా కేంద్రంపై పోరాడుతామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ ప్రకారం రూ.12 వేల కోసమూ ఉద్యమిస్తామంటూ రైతులకు ధైర్యం చెప్పారు. మాజీ మేయర్ నీతూకిరణ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు రామ్‌కిషన్‌రావు, నుడా మాజీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ నేతలు విశాలినిరెడ్డి, సుమనారెడ్డి, చింతా మహేశ్, తెలంగాణ శంకర్, శ్రీనివాస్‌గౌడ్, పులి జయపాల్ తదితరులు కవిత వెంట ఉన్నారు.

- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత వెల్లడి
- నిజామాబాద్ మార్కెట్‌లో పసుపు కొనుగోళ్ల పరిశీలన
- రైతులు, కూలీలతో మాటామంతి
- పసుపుబోర్డు వచ్చినా ఫాయిదా లేదు
- కాంగ్రెస్, బీజేపీ మోసం చేసినయ్
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాట నిలబెట్టుకోవాలె
- లేకపోతే రైతులతో కలిసి ఉద్యమిస్తామని హెచ్చరిక



మార్కెట్ యార్డులో పసుపు రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత



మహిళా కూలీతో ఆప్యాయంగా మాట్లాడుతున్న ఎమ్మెల్సీ

మార్చి 1న కలెక్టరేట్ దిగ్బంధం

# పసుపు రైతుకు 'మద్దతు'గా బీఆర్ఎస్ పోరాటం

నిజామాబాద్, ఫిబ్రవరి 22 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/కంఠేశ్వర్ : తొమ్మిది నెలలు తల్లి కడుపులో బిడ్డను మోసినట్లుగానే రైతులు తొమ్మిది నెలలు కష్టపడి పసుపు పంట పండిస్తారు. ఎన్నో ఆశలతో పంట తీసుకుని మార్కెట్‌కు వస్తే ఇక్కడ అంతా సిండికేట్ అయి రైతులను నిండా ముంచుతున్నారని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్, బీజేపీ పసుపు రైతులను మోసం చేశాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. రూ.15 వేల మద్దతు ధర ఇస్తామన్న బీజేపీ చట్టబద్ధత లేని పసుపుబోర్డు ఇచ్చి మోసం చేసిందని, రూ.12 వేల మద్దతు ధర ఇస్తామని కాంగ్రెస్ మాట తప్పిందని మండిపడ్డారు. రైతులకు కనీస మద్దతు ధర దక్కే వరకూ బీఆర్ఎస్ పార్టీ పోరాటం చేస్తుందని తెలిపారు. వారం రోజుల్లో రాష్ట్ర ప్రభుత్వం స్పందించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్నికలప్పుడు కాంగ్రెస్ చెప్పినట్లు రూ.12 వేల కంటే ధర తక్కువ వచ్చిన రైతులకు ఆ మేరకు ప్రయోజనం కల్పించాలన్నారు. ఏ ధరకు పసుపు పంటను అమ్ముకున్నా మిగులు లెక్క గట్టి ఇస్తామని కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే మార్చి 1న కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. గిట్టుబాటు ధర రాక పసుపు రైతులు అల్లాడుతున్న తరుణంలో ఎమ్మెల్సీ కవిత శనివారం నిజామాబాద్ మార్కెట్ యార్డుకు వచ్చి పసుపు కొనుగోళ్లను పరిశీలించారు. పసుపు రైతుల గోడు విన్న ఆమె.. వారికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. హమాలీలతో మాట్లాడి సాధక బాధకాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కవిత విలేకరులతో మాట్లాడారు.

### కాంగ్రెస్ మాట నిలబెట్టుకోవాలి..

ఎన్నికలప్పుడు కాంగ్రెస్ పార్టీ అనేక హామీలు ఇచ్చిందని, పసుపు రైతులకు రూ.12 వేల మద్దతు ధర ఇస్తామని చెప్పిందని కవిత గుర్తు చేశారు. అంత కంటే తక్కువ ధరకు అమ్ముకున్న రైతులకు రూ.12 వేలు భర్తీ చేసి ఆదుకుంటామని రేవంత్ రెడ్డి, రాహుల్‌గాంధీ చెప్పారని, ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని కవిత డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డికి అవగాహన లేకపోవడంతో రాష్ట్రానికి అన్యాయం జరుగుతున్నదన్నారు. ఏపీ నీళ్లను ఎత్తుకుపోతుంటే మూర్ఖపు ముఖ్యమంత్రి చూస్తూ నిలబడ్డారని మండిపడ్డారు. చంద్రబాబుకు గురుదక్షిణగా రేవంత్‌రెడ్డి నీళ్లను అప్పగిస్తున్నారా? అని నిలదీశారు. ఏపీ నీళ్ల దోపిడీపై కేంద్రానికి ఎందుకు లేఖ రాయడం లేదని ప్రశ్నించారు. చంద్రబాబు, ఆనాడు రాయలసీమ ప్రాజెక్టు కడితే కేసీఆర్ ప్రధాని మోదీకి ఫిర్యాదు చేశారని, కేసులు కూడా వేశారని గుర్తు చేశారు. వ్యక్తిగతంగా కామెంట్లు చేయడం, నోరు ఉందని ఎటు పడితే అటు ఒర్రుడే కానీ ఇచ్చిన హామీలు నెరవేర్చడం రేవంత్‌రెడ్డికి చాతనైత లేదన్నారు.

## ఇదేం ధర.. ఇదేం లెక్కా?

- వేస్ట్ ప్రభుత్వాలు రాజ్యమేలుతున్నాయి
- పసుపు రైతులను బీజేపీ ఎంపీ ఆగం చేస్తున్నాడు
- రెండు సార్లు ఎంపీగా గెలిచి ఒక్కసారి మార్కెట్‌కు రాడా?
- పసుపు రైతులతో మాటామంతిలో కవితతో రైతుల అభిప్రాయాలు

నిజామాబాద్, ఫిబ్రవరి 22 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్‌కు వచ్చిన ఎమ్మెల్సీ కవితతో రైతులు, కూలీలు తమ గోడు వెల్లబోసుకున్నారు. వేస్ట్ ప్రభుత్వాలు రాజ్యమేలుతున్నాయని, రైతులను పట్టించుకుంటలేరని ఆగ్రహం వ్యక్తం చేశారు. బాల్కొండ, ఆర్మూర్ నియోజకవర్గాల నుంచి వచ్చిన రైతులతో పాటు నిర్మల్, జగిత్యాల జిల్లాల నుంచి పసుపు తీసుకొచ్చిన రైతులు తమ ఇబ్బందులను వివరించారు. బీజేపీ ఎన్నికలప్పుడు చెప్పినట్లు రూ.15 వేలు మద్దతు ధర అందుతుందా? అని కవిత ప్రశ్నించగా, రైతులంతా కేంద్ర సర్కారు తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పసుపు రైతులతో కవిత మాటామంతి ఇలా..

**కవిత: నమస్తే రైతన్నలు. ఎట్లున్నరు. పసుపు పంటకు ధర వస్తున్నదా?**

**రైతులు:** అక్కా మాది కమ్మర్‌పల్లి. మా తాతల కాలం నుంచి పసుపు పండిస్తున్నం. ఇత్తనం నుంచి డ్రమ్ము పట్టే దాకా రైతులకు కష్టాలే మోపైనాయి. కనీస ధర అస్తలేదు. అడిగినా ఎవ్వలూ పట్టించుకుంటలేరు.

**బీజేపీ వాళ్లు పసుపుబోర్డు తెచ్చామంటున్నారు కదా. లాభం జరగలేదా?**

**రైతులు:** యాడ జరిగింది. బోర్డు తెచ్చామన్నారు. అది బోర్డుకే పరిమితమైంది. పసుపుబోర్డు యాడుందో. అదేందో ఏమో మాకు తెల్వదు. బోర్డు వచ్చింది కదాని ఆశతో ఉన్నం. ధర మంచిగా వస్తుందనుకుంటే దరిద్రంగా మారింది. క్వింటా పసుపునకు రూ.8 వేల ధర పెట్టడం పచ్చి మోసం.

**గిట్టుబాటు కాదు కదా.. ఎట్లా భరిస్తున్నరు నష్టాలను?**

**రైతులు:** ఏం జేసుడో ఏమో ఏం అర్థమైతలేదు. రూ.8వేలు ఇస్తే మాకు ఏ లెక్కన సరిపోతది. ఖర్చులకు సుతా సరిపోవు. మార్కెట్‌లో వ్యాపారులంతా సిండికేట్ అయ్యింన్రు. పది మంది మోపైతుంన్రు. ముందే ఒక ధర అనుకుంటున్నారు. రైతుల కుప్పల వద్దకు వచ్చి అదే చెబుతున్నారు.

**సిండికేట్ వ్యాపారులపై కలెక్టర్‌కు ఏమైనా ఫిర్యాదు జేసింన్రా.**

**రైతులు:** వాళ్లకు ఫిర్యాదు జేసినా పట్టించుకోరు. సిండికేట్ గాళ్లతోనే రైతులకు నష్టాలు మోపవుతున్నాయి. నాలుగైదు రోజులు వేచి చూస్తే కూడా ధర రాక ఎక్కువ రోజులు మార్కెట్లో ఉండలేక రైతులు ఉట్టి చేతులతో వెళ్లలేక ఎంతకో కొంతకు దళారులకు అప్పగించాల్సి వస్తున్నది.

**శివరాత్రి నాటికి ధర పెరుగుతదంట కదా.. నిజమేనా?**

**రైతులు:** శివరాత్రికి పసుపు బాగా అత్తది. ఇంకా 80 శాతం పంట మార్కెట్‌కు రాలే. రైతులకు భయమైతన్నది. ధర లేక మార్కెట్‌కు అచ్చుడెందుకో అని బాధ పడుతున్నరు. శివరాత్రికి మహారాష్ట్ర నుంచి కూడా పసుపు అత్తే ధర మరింత పడిపోతది.

**ఎంత ధర ఉన్నా రూ.12వేలు ఇస్తామని కాంగ్రెస్ వాళ్లు చెప్పింన్రు. అడుగుదామా? కేంద్రం మీద రూ.15వేల కోసం కొట్లాడుదామా?**

**రైతులు:** జై శ్రీరాం అనుడు తప్పా ఏం చేస్తలేరు. అంతా ఉత్త కథనే. రెండు సార్లు ఎంపీగా గెలిచిన అర్వింద్ ఒక్కసారి కూడా మార్కెట్‌కు రాలేదు. ఎన్నికలప్పుడు వస్తుంన్రు. పోతుంన్రు. ఏవేవో చెబుతుంన్రు.

**ఏమవ్వా బాగున్నవా? ఎట్లున్నది మార్కెట్ పరిస్థితి. కూలీ దొరుకుతున్నదా?**

**మహిళా కూలీ:** ఐదు రూపాయల బువ్వ దొరుకుతలేదు. కేసీఆర్ ఉన్నప్పుడు సక్కగా ఉండే. ఇప్పుడు ఉపాసం ఉంటున్నం.

**మేము ఇప్పుడు లేము కదా. సర్కారు మారింది కదా. మార్పు అన్నారు. మార్పు జరిగింది. అన్నం బంద్ చేసింన్రు.**

**రైతులు:** అప్పుడే బాగుండే. సర్కార్ దవాఖానాల కూడా బువ్వ అందుతుండే. ఇప్పుడు ఎవ్వలకు అన్నం దొరుకుతలేదు.



బట్టాపూర్ వాగులో పోలీసులు పట్టుకున్న జేసీబీ

నమస్తే తెలంగాణ ఎఫెక్ట్

బట్టాపూర్ పెద్దవాగులో ఆరు ట్రాక్టర్లు, ఒక జేసీబీ పట్టివేత

## ఎట్టకేలకు కదిలిన యంత్రాంగం

మోర్తాడ్, ఫిబ్రవరి 22: ఏర్గట్ల మండలం బట్టాపూర్ గ్రామంలోని పెద్దవాగు నుంచి అధికార పార్టీకి చెందిన కొందరు ఇసుక అక్రమ తవ్వకాలను యథేచ్ఛగా చేపడుతున్నారు. కొంతకాలంగా కొనసాగుతున్న ఇసుక దందాపై 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమవుతున్న వరుస కథనాలకు అధికార యంత్రాంగం కదిలింది. అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయన్నది అధికారుల దాడులతో బట్టబయలైంది. గత సోమవారం నుంచి అధికారపార్టీ నాయకు ల ఆధ్వర్యంలో అక్రమ ఇసుక తవ్వకాలు చేపట్టా రు. దీనిపై 'నమస్తే తెలంగాణ'లో వరుస కథనాలు రావడంతో శనివారం మైనింగ్, రెవెన్యూ, పోలీస్ అధికారులు దాడులు చేశారు. ఇసుకను అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉన్న ఆరు ట్రాక్టర్లు, ఒక జేసీబీని పట్టుకున్నారు. అధికారులు ఎన్ని వే బిల్లులు ఇచ్చారు.. ఎన్ని క్యూబిక్ మీటర్ల ఇసుకను తవ్వారు తదితర అంశాలను మైనింగ్ అధికారులు పరిశీలించినట్లు సమాచారం. అధికార యంత్రాంగం కదలడంతో ఎట్టకేలకు బట్టాపూర్ పెద్దవాగులో అక్రమ ఇసుక తవ్వకాలకు బ్రేక్‌పడినట్లయ్యింది.

**మరికొన్ని గ్రామాలపై అక్రమార్కుల దృష్టి..**

బాల్కొండ సెగ్మెంట్‌లో పెద్ద ఎత్తున జరుగుతున్న ఇసుక అక్రమ తవ్వాకలపై 'నమస్తే తెలంగాణ' వరుస కథనాలతో రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా స్పందించింది. ఇందులో భాగంగా ఉన్నతాధికారి నుంచి వచ్చిన ఆదేశాలతో విజిలెన్స్ అధికారులు శనివారం దాడులు చేసి వాహనాలు సీజ్ చేశారు. అయితే, స్థానిక కాంగ్రెస్ నేతలు మరికొన్ని గ్రామాల్లో ఇసుక వేట కోసం ప్రయత్నాలు చేస్తుండడం, ఇప్పటికే ఆయా మండలాల్లో పోలీసులు, తహసీల్ కార్యాలయ సిబ్బందితో ఒప్పందాలు కూడా చేసుకున్నట్లు సమాచారం. మెండోరా మండలం వెల్కటూరు, ఏర్గట్ల మండలం తొర్తి, మోర్తాడ్ మండలం సుంకెట్, పాలెం, భీమ్‌గల్ మండలంలో బడాభీమ్‌గల్, భీమ్‌గల్, బెజ్జోరా, గోన్‌గొప్పుల తదితర గ్రామాల్లో పెద్ద ఎత్తున ఇసుక అక్రమ తవ్వకాలకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిసింది. ఈ విషయంలో ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతలు పచ్చజెండా ఊపినట్లు సమాచారం. ఓవైపు ప్రభుత్వం ఇసుక అక్రమ రవాణా అరికట్టాలని చెబుతుంటే, మరోవైపు అధికార పార్టీకి చెందిన వారే దొడ్డిదారిలో ఇసుక తోడేందుకు ఏర్పాట్లు చేస్తుండడం చర్చనీయాంశమైంది.



బట్టాపూర్ వాగు నుంచి పోలీసులు స్వాధీనం చేసుకున్న ట్రాక్టర్లు

## అక్రమ తవ్వకాలు ఎవరి కోసం?

- తక్కువ ధరకే ఇసుక అందిస్తున్నామంటూ సోషల్‌మీడియాలో పోస్టులు
- అభాసుపాలవుతున్న అధికార పార్టీ నేతలు

మోర్తాడ్, ఫిబ్రవరి 22: ఇసుకను తక్కువ ధరకే ప్రజలకు అందిస్తున్నామని కాంగ్రెస్‌పార్టీకి చెందిన ఓ నాయకుడు సోషల్‌మీడియాలో పోస్టు చేసిన రోజే బట్టాపూర్ పెద్దవాగులో అధికారులు దాడులు చేశారు. అక్రమంగా ఇసుక తవ్వుతున్న జేసీబీతోపాటు ఇసుకను తరలించేందుకు సిద్ధంగా ఉన్న ఆరు ట్రాక్టర్లను పట్టుకున్నారు. ఒకవైపు అక్రమ ఇసుక రవాణాపై ఉక్కుపాదం మోపాలని, దీనిపై జిల్లా కలెక్టర్లు, సీపీలు దృష్టిసారించాలని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పడం, జిల్లాలో ఇసుక దోపిడీపై కఠినంగా వ్యవహరించాలని సీపీ ఆదేశాలు జారీ చేసినా.. మరోవైపు ఇసుక అక్రమ రవాణాకు పాల్పడడం ఎవరి లాభం కోసమనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. పెద్దవాగులో ఏడాది కాలంగా ఇసుక అక్రమ తవ్వకాలు చేపడుతుంటే దాన్ని ప్రోత్సహిస్తున్నట్లు కాంగ్రెస్ నాయకులు సోషల్‌మీడియాలో పోస్టులు పెట్టడం, ఇసుక తరలిస్తున్న వాహనాలు పట్టుబడడం స్థానికంగా చర్చనీయాంశమైంది. ఇలా ఎప్పుడు జరగలేదని ఇటు ప్రజలు, ఏం చేయాలో ఏం మాట్లాడాలో తెలియడంలేదని కొందరు అధికారులు పేర్కొనడం గమనార్హం. స్వయంగా సీఎం ఇసుక దోపిడీపై ఉక్కుపాదం మోపుతామని చెప్పిన నేపథ్యంలో బాల్కొండ నియోజకవర్గంలో మాత్రం అక్రమ తవ్వకాలు చేపడుతూ ప్రజల కోసమేనని పోస్టులు పెట్టడం అభాసుపాలు కావడం తప్ప ఒరిగేదేమీ లేదని ప్రజల్లో అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

## స్కూటీపై కుంభమేళాకు..

- పోతంగల్ గ్రామానికి చెందిన యువకుల సాహసం
- 5 రోజుల్లో ప్రయాగరాజ్, కాశీయాత్ర పూర్తి




పోతంగల్, ఫిబ్రవరి 22 : నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండలకేంద్రానికి చెందిన ఇద్దరు యువకులు స్కూటీపై ప్రయాగ్‌రాజ్ కుంభమేళా యాత్రకు వెళ్లారు. వందలాది కిలోమీటర్లు ప్రయాణించి, త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు చేసి తమ స్వస్థలానికి చేరుకున్నారు. ఈ యాత్రను ఐదు రోజుల్లో పూర్తిచేయడం విశేషం.

పోతంగల్ గ్రామానికి చెందిన యువకులు సితాల సంతోష్, సాదుల శ్రీధర్ స్నేహితులు, అందరూ కుంభమేళాకు వెళ్తుండడంతో తాము కూడా వెళ్లి రావాలని అనుకున్నారు. 144 ఏండ్లకు ఒకసారి వచ్చే ఈ మహా కుంభమేళాలో పవిత్ర స్నానం చేయాలని నిర్ణయించుకొని ప్రయాణానికి సిద్ధమయ్యారు. అయితే, అందరిలా వీరు బస్సులు, ట్రైన్లు, కార్లలో కాకుండా ద్విచక్రవాహనంపై వెళ్లేందుకు నిర్ణయించుకున్నారు. ఈనెల 18న పోతంగల్ నుంచి బయల్దేరారు. మొదట ప్రయాగరాజ్‌కు వెళ్లి నదీస్నానం చేశారు. అనంతరం వారణాసిలోని కాశీ విశ్వేశ్వరున్ని దర్శించుకొని తిరుగుప్రయాణమయ్యారు. మొత్తం ఐదు రోజుల్లో సుమారు 2500 కిలోమీటర్లు చుట్టేసి, శనివారం మధ్యాహ్నం స్వగ్రామానికి చేరుకోవడంతో కుటుంబీకులు, బంధుమిత్రులు ఘన స్వాగతం పలికారు. ఈ యాత్ర తమకు ఎంతో సంతోషం కలిగించిందని సదరు యువకులు తెలిపారు.



కుంభమేళాకు వెళ్లి తిరిగివచ్చిన సంతోష్, శ్రీధర్

## 'దుమ్ము'దులిపించిన గ్రామస్తులు

- వల్లభపూర్‌లో ఇసుక టిప్పర్ల అడ్డగింత
- దుమ్ములేవకుండా రోడ్లపై నీళ్లు చల్లించిన వాహన యజమానులు

కోటగిరి, ఫిబ్రవరి 22: ఉమ్మడి కోటగిరి మండలంలోని వల్లభపూర్‌లో ఇసుక లోడ్‌తో వెళ్తున్న టిప్పర్లను గ్రామస్తులు శనివారం అడ్డుకున్నారు. ఇసుక లోడ్‌తో టిప్పర్లు వెళ్తుండడంతో రోడ్లపై దుమ్ములేచి ఇండల్లోకి వస్తుందని వారు మం డిపడ్డారు. మంజీరా నది నుంచి ఇసుక లోడ్‌తో వెళ్తున్న వాహనాలు వల్లభపూర్‌కు చేరుకోవడంతో గ్రామస్తులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వీడీసీ ప్రతినిధులు మాట్లాడుతూ వారం రోజుల నుంచి ఇసుక లారీలు, టిప్పర్లు పెద్దసంఖ్యలో నడుస్తున్నాయని, దీంతో గ్రామంలోని రోడ్లపై దుమ్ము లేచి ఇండ్లలోకి వస్తుందని, తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని మండిపడ్డారు. రోడ్డుపై దుమ్ము లేవకుండా నీళ్లు పట్టాలని, లేకపోతే వాహనాలను కదలనివ్వబోమని భీష్మించుకు కూర్చున్నారు. దీంతో వాహన డ్రైవర్లు తమ యజమానులకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారు. వెంటనే ట్యాంకర్‌ను రప్పించి రోడ్డుపై నీళ్లు చల్లడంతో గ్రామస్తులు శాంతించారు. రోడ్డుపై దుమ్ము లేవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



ఇసుక టిప్పర్లను అడ్డుకున్న గ్రామస్తులు

## మాలలను అణచివేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

**జాతీయ మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్**



నిజామాబాద్‌లో సమావేశమైన మాలమహానాడు నాయకులు

ఖలీల్‌వాడి, ఫిబ్రవరి 22 : సీఎం రేవంత్‌రెడ్డి మాలలను అణిచివేస్తున్నారని జాతీయ మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ ఆరోపించారు. ఉమ్మడి జిల్లా జాతీయ మాలమహానాడు సమావేశాన్ని నిజామాబాద్‌లోని సంఘ భవనంలో జిల్లా అధ్యక్షుడు పులి జైపాల్ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పిల్లి సుధాకర్ హాజరై మాట్లాడారు. మాలల ఓట్లతో కాంగ్రెస్ పార్టీ గద్దెనెక్కిందన్నారు. మందకృష్ణ మాదిగ బెదిరింపులకు సీఎం రేవంత్‌రెడ్డి భయపడి, మాలల్ని దెబ్బ తీస్తున్నారని ఆరోపించారు. జస్టిస్ షమీం అక్తర్‌తో తప్పుల తడకగా నివేదికను రూపొందించారన్నారు. రిపోర్టు ఎందుకు బయటపెట్టడం లేదని ప్రశ్నించారు. మాల ఉపకులాల మధ్య మందకృష్ణ మాదిగ చిచ్చు పెట్టి మాలలపై విషం చిమ్ముతున్నాడని, ఈ పద్ధతి మార్చుకోవాలని అన్నారు. అనంతరం జాతీయ మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శిగా పులిజైపాల్, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడిగా ఎబినైజర్‌ను నియమించారు.

## మార్కెట్ యార్డుకు మూడు రోజుల సెలవు

కంఠేశ్వర్, ఫిబ్రవరి 22 : నిజామాబాద్ మార్కెట్ యార్డు ఈనెల 26 నుంచి 28వ తేదీ వరకు మూసి ఉంటుందని మార్కెట్ యార్డు సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 26న మహాశివరాత్రి, 27న లేబర్ హాలీడే, 28న అమావాస్య సందర్భంగా క్రయ విక్రయాలు జరగవని, వ్యాపారులు తమ వ్యవసాయ ఉత్పత్తులను యార్డుకు తీసుకురావద్దని సూచించారు. మార్చి ఒకటో తేదీ నుంచి యథావిధిగా బిడ్డింగ్ కొనసాగుతుందని తెలిపారు.